

# మానసోల్లాసం



అంతా మనం అనుకున్నట్టుగా జరిగి పోతూ వుంటే మనస్సుకు చాలా ఉత్సాహంగా వుంటుంది. ఏ మాత్రం కాస్త ఎక్కువ తక్కువలు వచ్చిన అతలాకుతలం అయి పోయి దిక్కు తోచకుండా పోతుంది. ఏవేనా పెద్ద పెద్ద విషయాలలో యిది సహజమేగాని నిత్య నైమిత్తికం అయిన కూరగాయలు కొనుగోలు కూడ యీ సూత్రాన్నే పాటించి గందరగోళం చేసుకునేవాళ్ళు ఉన్నారు. 'చూశారా - చూశారా - యేమయిందో' అంది పక్కింటి పిన్ని గారు. ఆమె అన్నిటినీ అతిశయోక్తులుగా చెబుతుందని నాకు అనుభవం మీద పూర్తిగా తెలుసును గనుక యేమీ అయి వుండదని ముందుగానే అనుకున్నాను. అయినా యీ నిర్లిప్తత ఆమె పసిగట్టిందంటే ఆమె పేట్రేగి పోతుంది. చెప్పదలుచుకున్నది సాంతం చెప్పకుండా వెళ్ళిపోతుంది. అందుకని ఎందుకయినా మంచిదని 'బాబాయిగారు పుచ్చు వంకాయలు తెచ్చిపడేసి వుంటారు. అయినా - 'అంటూ వుండగానే మధ్యలో అడ్డం వచ్చి ఆమె ఇలా అన్నారు: 'పుచ్చు వంకాయలు తెచ్చిన బాగానే వుండును. అంతకన్న ఘోరం చేశారు. ఒక అరకిలో కందిపప్పు, కిలో పెసర పప్పు తెమ్మని చెప్పాను. ఏం చేశారనుకున్నావు? కిలో కందిపప్పు, అరకిలో పెసరపప్పు తెచ్చి, నా మొహాన కొట్టారు. ఇదేమిటండీ అంటే నువ్వు అంతే చెప్పావు అని దబాయిస్తున్నారు పైగా'.

'పోనీలెండి. పుచ్చిపోయేవేం కాదుగా. డబ్బాల్లో పోసి వుంచండి. అంతగా అర్జెంటయితే పెసరపప్పు నేనుయిస్తాను. ఈ నెల పొట్లంయింకా విప్పనే లేదు. తీసుకు వెళ్ళండి'.

'అది కాదమ్మా. పెసరపప్పు లేక పోయిన మరేం పృథ్వీ మునిగిపోదు. అదేం అవసరం అని తెప్పించ లేదు. కలంగ పుంగం చేస్తారా లేదా చూదామని పరీక్ష పెట్టాను. అంతే! అదే యేదయిన కొంపలు మునిగే వ్యవహారం అయినా యింతేగదా! ఇట్లాంటి మనిషి ఆ ఆఫీసులో యెట్లా పనిచేస్తున్నారో విచిత్రం'.

ఇంట్లోకి కావలసిన వంట సామాగ్రి తేవడం, కూరగాయలు వరకు రావడం యివన్నీ యింకా మగవాళ్లే చేయాలనుకోవడం విడ్డూరం. మంచి కూరగాయలు తేలేదు గనుక మగవాడు ఆఫీసులో కూడా దిగదుడుపేనని పిన్ని గారు అభిప్రాయ పడడం మరింత

విస్తారం. అసలు సాయంత్రం పూట చల్లగాలికి అలా షికారుకు వెళ్ళి యింట్లోకి కావలసిన వస్తువులన్నీ కొనుక్కు తెచ్చుకోవడం ఆడవాళ్ళు చేసుకోవలసిన పనికాదూ? ఆఫీసుల్లో పనిచేసే ఆడవాళ్ళయినా ఈ పని చలాగ్గా తేలికగా చేసుకోవచ్చు సాయంత్రంపూట అందులోనూ అవతల మనిషికి ఆ పని సరిగ్గా చేతగాదు అనుకున్నప్పుడు నిశ్చింతగా తానే బాధ్యత తనమీద వేసుకోవచ్చు. పక్కింటి పిన్నిగారి లాంటి మనుషులు. కాని యిక్కడ వచ్చిన చిక్కేమిటంటే- వీళ్ళకు యెవరినో ఒకరిని సాధించుకుంటూ కూచోకపోతే రోజు సరిగ్గా నడిచినట్లు లెక్క కాదు. అన్నీ సరిగ్గావున్నాయనుకోవడం, సరిపుచ్చుకుపోవడం వీళ్ళకు సుతారమూ యిష్టం వుండదు అన్నీ అమర్చిన దాంట్లో అత్తగారొచ్చి వేలుపెట్టింది అన్నట్లుగా ప్రవర్తించకపోతే వాళ్ళకు నిద్రపట్టదు. ఇంకో రకం మనుషులున్నారు. వాళ్ళు యే పనయినా ఒకటే అనుకుంటారు. ఆఫీసుల్లో కూర్చొని ఆ కాగితాలమీద చెడామడా రాయకపోతే, నెలకోనవలన్నా రాసి పడెయ్యగూడదుటండీ. ఏ పత్రికలోనన్నా సీరియల్‌గా వేసుకోవచ్చు-' అంటుంది. కోమలమ్మ ఆఫీసులో రాతలకూ పత్రికలో రాతలకూ యేమీ వ్యత్యాసంలేదు ఆమెకు. ఏదయిన కాగితంమీద కలంతో రాయడమే గా! పప్పురుబ్బేవాడికి అది కందిపప్పు అయితేనేం, శనగపప్పు అయితేనేం అన్నట్లుగా వుంటుంది ఆమె ధోరణి. ఆడపిల్లలు రాసే నవలంటే విసిగెత్తి—



ఆండాళమ్మగారు ఆవకాయ పెట్టే హడావిడిలో క్రిందపడేదు తన బారెడు జుట్టు ముడేసుకునే అవస్థ ఈనాడు తప్పినందుకు సంతోషించింది. కానైతే కాయలు నరకడానికి మొగుడు సాయం లేకపోయెనే అని చికాకుపడింది.

---

పోయానని చెప్పి ఆమె 'మగపేరు'తో ఒక కథ కూడా రాసింది. ఆ మధ్య. దాన్ని తీసుకువెళ్ళి ఏ పత్రికలోనన్నా వేయించమని భర్తని పురమాయించింది. నాకు వాళ్లెవ్వరూ తెలీదు. నీ తంటాలేవో నీవే పడు' అని ఆయన చెపితే యిప్పటికి పన్నెండు పత్రిక ఆఫీసులో కనుపించింది తన కాగితాలకు. తన కథకు వార్షికోత్సవం గూడా అయిపోయింది గాని యింకా ముద్రణ భాగ్యం కలగలేదే అని ఆమెకు విచారం. ఎవరికేనా చదివి వినిపించాలన్నా ఆమెకు చికాకు. పత్రికల్లో పడ్డాక ఎవరికివారు చదువుకు ఆనందించాలిగాని ముందుగా వ్రాత ప్రతిలోంచి చదివి వినిపిస్తే అన్నీ తప్పులున్నట్లుగానే కనిపిస్తాయి. అందుకనే

ఆమె తను రాసిందాన్ని మళ్ళీ చదువుకోదు కూడా. 'స్పెల్లింగ్ తప్పులున్నా దిద్దుకోవాదుటే' అని ఆయనగారు అంటే 'పత్రికాఫీసుల్లో ప్రూఫ్‌రీడర్లు వుంటారుగా. వాళ్లు చూసుకుంటారులెండి అవన్నీ. అన్నీ మనమేరాసి పంపిస్తే యింక వాళ్లకు మాత్రం పనేం వుంటుంది' అంటుంది. ఇతరులకు యేదో పని కల్పించడంకోసమే తను సమయమంతా త్యాగంచేసి కథ రాశానని ఆమె అభిప్రాయం. 'ఈకథ అచ్చువేస్తే యింతవరకూ కథకుడుగా నాకున్న మంచి పేరు కాస్తాపోతుంది. ఈకొత్త కథకుడు పాఠకుల హృదయాలలో పీఠంవేసుకు కూర్చుంటాడు.' అన్న భయంకొద్దీ పత్రికా సంపాదకులు తన కథను అచ్చువెయ్యడం లేదు తప్ప. తన రచనలో ఎటువంటి లోపమూ లేదని ఆమె దృఢ విశ్వాసం. పత్రికా సంపాదకులంతా తన నుంచి తమను తాము రక్షించుకోక ప్రయత్నంలో ఒక్కటయిపోయారని ఆమె ఘంటాపథంగా చెబుతుంది.

పోనీలెండి పాఠకులకు మంచి కథలు చదువుకునే రోజులు యింకా రాలేదు, నేనేం చెయ్యను. అనుకుని తృప్తి పడుతుంది. తన కథల విషయం వచ్చినప్పుడల్లా యిలా సమాధానం చెప్పుకుని మనసుతో వెన్నెలలు విరిసినట్టుగా మురిసిపోతూవుంటుంది.

'అన్నీ సంగతులూ నాకే తెలుసు' అనుకోవడంలోనే చాలా మందికి సంతోషంవుంది. 'నాకు తెలియని సంగతులేమయినా వుంటే గదా యితరుల దగ్గర నేర్చుకోవటానికి? అయినా వాళ్ళకు మాత్రం యేం తెలుసు? ఊరికే తెలుసునన్నట్టు పోజులు పెడతారు' అనుకుంటారు. 'తెలియకపోతే నన్ను అడగాలి గాని యిలా అన్నీ తప్పులు తడకలు చేసి పెడితే యెట్లా?' అని కోపగించుకున్నారు సుందరిని వాళ్ళ ఆఫీసరు ఒకమారు. సుందరి నదురు బెదురు లేకుండా 'తెలియదనినాకు తెలియలేదండీ. ఇదే సరయిన పద్ధతి అనుకున్నాను' అన్నదిటే.

'అమ్మా! తెలియనిది తెలియదు అని తెలియడమే గొప్ప విజ్ఞానం తల్లీ' అని నిట్టూర్చాడట ఆ ఆసామీ.

ఒకమారు బంధువుల యింటికి వెళ్ళినప్పుడు ఓ ముసలాయన యిలా అన్నారు: 'ఎవరమ్మా నువ్వు... ఓహో! ఫలానా! మంచిదమ్మా. నాకు కళ్ళు సరిగా కనపడటంలేదు. ఎవరినీ సరిగా గుర్తుపట్టలేను. ఏమీ అనుకోకు. ఎంత దగ్గరి వాళ్ళు తట్టినా - చెబితేగాని తెలియదు'

నేను వినయంగా 'ఫరవా లేదండీ తాతగారూ! మీరు చాలావయసు. మీకు తెలిపితేనన్నా తెలుస్తుంది. కాని చాలా మందికి కళ్లూ కాళ్లూ అన్నీ చక్కగానే వున్నా చెప్పినాగానీ తెలియదు' అన్నాను. ఆయన చాల సంతోషించారు కాని నా కూడా వున్న యితరులకు మాత్రం యీ సమాధానం కాస్త యిబ్బందిగానే అనిపించింది. ఏమయినా ఎవరి మనస్సును వాళ్ళు సంతోషాన్ని కులాసాను పులుముకుందుకు సతతం ప్రయత్నం చేస్తూనే వుండాలి గదా!

— అరుంధతి